సాక్షి గుంటూరు

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



వేదాద్రిలో 'హ్యూమన్‌రైట్స్' చైర్మన్

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని ఏపీ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ సీతారామమూర్తి శనివారం రాత్రి దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు సరస్వతినగర్‌కు చెందిన వెంకటరెడ్డి కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.

నాలుగు కోవిడ్ కేసులు నమోదు



గుంటూరుమెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెండు, తేలప్రోలు, హనుమాయపాలెంల్లో ఒక్కొక్కటి చొప్పన కేసులు వచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
గుంటూరు	6:28	4:34
నరసరావుపేట	6:30	4:32
బాపట్ల	6:28	4:34

న్యూస్‌రీల్

జగనన్న కాలనీలో కలెక్టర్ పర్యటన



మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలోని జగనన్న కాలనీలను శనివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. వేసవిలో పనులు శరవేగంగా, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద 3588 ఇళ్లు బేస్‌మట్టం లెవల్‌కు వచ్చాయని హౌసింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. మేడికొండూరు తహసీల్దార్ కరుణకుమార్, హౌసింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీనివాస్, ఏపీఎంఆర్‌డీసీ డైరెక్టర్ చిన్నప్పరెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'పది' ఇన్విజిలేటర్ సస్పెన్షన్

రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెంలో జెడ్పీహైస్కూలులో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల తీరును శనివారం ఆర్జేడీ పార్వతి పరిశీలించారు. కేంద్రంలో స్లిప్‌లు కనిపించటంతో మాస్‌కాపీయింగ్ జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మునియ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి నరేంద్ర, ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌లను ఆదేశించారు. ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ రామారావు తెలిపారు.

20న విస్తరణ సలహా మండలి సమావేశం

గుంటూరురూరల్: కృష్ణా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో కృష్ణా మండలంలోని వివిధ జిల్లాల రైతుల సమస్యలు, వాటి పరిష్కారాలు, రానున్న సంవత్సరంలో పరిశోధన, విస్తరణ కార్యక్రమాల దిశానిర్దేశంపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు, ఆదర్శరైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొంటారన్నారు. ఆసక్తిగల రైతులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

డీఎస్‌ఓగా మోహన్‌బాబు



గుంటూరువెస్ట్: జిల్లా పౌర సరఫరాల శాఖాధికారిగా జి.మోహన్‌బాబును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మోహన్‌బాబు పల్నాడు జిల్లాలో పనిచేశారు. గుంటూరులో డీఎస్‌ఓగా పనిచేస్తున్న ఎస్.పద్మశ్రీని పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు.

ఆరోగ్యం ప్రతి ఉద్యోగి హక్కు

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తలపించిన మెగా మెడికల్ క్యాంప్



పేర్లు రిజిస్టర్ చేయించుకుంటున్న ఉద్యోగులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులంటే కేవలం పని చేయడానికి మాత్రమే కాదని, వారి ఆరోగ్యం, సంక్షేమం ఎంతో ముఖ్యమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం సీఏసీ-కంపల్సరీ హెల్త్ చెకప్‌లో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తలపించింది. తొలిరోజు శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖరరావులు మెడికల్ క్యాంపును లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దీని ప్రభావంతో అనారోగ్యాల బారిన పడుతూ ఇబ్బందులనెదుర్కొంటున్న సంఘటనలు తాము నిత్యం చూస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా 17 ప్రధానమైన అనారోగ్య సమస్యలకు సంబంధించి ప్రముఖ వైద్యుల సారధ్యంలో అత్యాధునిక మెషినరీతో వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఆదివారంతో ముగియనున్న ఈ మెడికల్ క్యాంపును ఉద్యోగులు, అధికారులు ఉపయోగించుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సహజంగా ఒక వయస్సు రాగానే మహిళల్లో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు ఇటు ఉద్యోగాన్ని, అటు కుటుంబాన్ని చూసుకునే క్రమంలో ఆరోగ్యానికి తక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. అటువంటి వారికి ఎంతో ఉపయోగంగా మెడికల్ క్యాంపు ఉంటుందని చెప్పారు. తొలి రోజు 1200 మంది అధికారులు, ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు.

ప్రముఖ వైద్యుల సాయంతో...

మెడికల్ క్యాంపును సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మాదిరిగా ఏర్పాటు చేశారు. గుండె, క్యాన్సర్, మూత్ర పిండాలు, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, బ్రెయిన్‌లాంటి ఎన్నో వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలన్నీ ప్రముఖ వైద్యుల సహాయంతో ఒక్క చోటే అందుబాటులోకి తెచ్చారు. మామోగ్రఫీ, ఎకో, ఈసీజీ, బ్లడ్ తదితర సమస్యలకు సంబంధించి 17 రకాల పరీక్షలు నిర్వహించారు. ఎండ ఇబ్బందులు పడకుండా కొన్ని చోట్ల ఏసీలు, కూలర్‌లు ఏర్పాటు చేశారు.



మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభించి, బీపీ చెకప్ చేయించుకుంటున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



రక్త పరీక్ష చేయించుకుంటున్న జేసీ రాజకుమారి

క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలి..



ఇంత ఆధునిక పరిజ్ఞానంతో కూడిన మెడికల్ క్యాంపు ఉద్యోగుల కోసం ఏర్పాటు చేయడం ఇప్పటివరకు చూడలేదు. ముఖ్యంగా 35 నుంచి 40 ఏళ్లు దాటిన తర్వాత అనారోగ్య సమస్యలు ప్రారంభమవుతుంటాయి. అయినా మనం పట్టించుకోము. అవి తీవ్ర సమస్యలకు దారి తీస్తాయి. ఇలాంటి హెల్త్ క్యాంపులు ఏడాదికి కనీసం రెండు సార్లు ఏర్పాటు చేయాలని మనవి.

– పీవీ భావన్నారాయణ, సర్వే డిపార్ట్‌మెంట్

ప్రభుత్వానికి ధన్యవాదాలు..



వాస్తవానికి మహిళలు ఎన్నో అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ఇప్పటివరకు ఇన్నిరకాల వైద్య పరీక్షలను, ప్రముఖ వైద్యులను ఒకేచోట అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉంది. కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథాలయ సంస్థ ఉద్యోగి

నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదు..



చాలా చిన్న పరీక్షల ద్వారా అనేక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి నయం చేసుకునే వీలుంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు పని ఒత్తిడి కారణంగా విపరీతమైన ఒత్తిడికి గురవుతుంటారు. దాని కారణంగా బీపీ పెరగడం, హృద్రోగ సమస్యలు చుట్టుముట్టడం జరుగుతాయి. నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కారాదు. ఆహార అలవాట్లు మార్చుకోవాలి. జీవనశైలిలో మార్పు రావాలి.

– డాక్టర్ సీఎస్ రావు, కార్డియాలజిస్ట్, లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

గైనిక్ సమస్యలు సహజం..



గతంతో పోల్చుకుంటే మహిళల్లో టీనేజర్స్ నుంచి వృద్ధుల వరకు గైనిక్ సమస్యలు అధికమయ్యాయి. అదే విధంగా అత్యాధునిక వైద్యం కూడా అందుబాటులోకి వచ్చింది. ఆడపిల్లలు తమ ఇబ్బందులను ధైర్యంగా తల్లికి, వైద్యులకు చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా పీహెచ్‌సీలల్లో గైనకాలజిస్ట్‌లను అందుబాటులో ఉంచుతుంది. చిన్న సమస్యను ఆదిలోనే తుంచి వేయాలి.

– డాక్టర్ అలేఖ్య, గైనకాలజిస్ట్, మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ముగిసిన 'పది' పరీక్షలు

- ఈనెల 19 నుంచి స్పాట్ వాల్యూయేషన్
- మే రెండో వారంలో ఫలితాలు విడుదల చేసేందుకు సన్నాహాలు



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 3వ తేదీన ఆరు పేపర్ల విధానంలో ప్రారంభమైన పరీక్షలకు గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన 138 కేంద్రాల పరిధిలో 27,714 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో మొత్తం ఆరు రోజుల పాటు జరిగిన పరీక్షల్లో ప్రతిరోజూ 99 శాతానికి పైగా విద్యార్థులు హాజరు నమోదు కావడంతో పాటు జిల్లాలో ఎక్కడా ఒక్క మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాకపోవడం చెప్పుకోదగిన విషయం. ఈనెల 17, 18న జరగనున్న కాంపోజిట్, ఒకేషనల్ కోర్సుల పరీక్షలతో టెన్త్ పబ్లిక్ పరీక్షలు సమాప్తం కానున్నాయి. టెన్త్ ప్రధాన కోర్సుల పరీక్షలు ముగియడంతో విద్యార్థుల జవాబు పత్రాలకు వేగవంతంగా మూల్యాంకనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం ఈనెల 19 నుంచి స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభించనుంది. స్పాట్ వాల్యూయేషన్ నిర్వహణ అనంతరం మే రెండో వారంలో ఫలితాలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పరీక్షల విధుల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులుగా వ్యవహరించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని జిల్లాలో పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆమె చెప్పారు.



డాక్టర్ అంబేడ్కర్‌కు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి డొక్కా, పల్నాడు కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

ప్రపంచ మేధావి భారతరత్న అంబేడ్కర్

- కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంత్యుత్సవంలో మాజీ మంత్రి డొక్కా
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాదు

నరసరావుపేట: ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వాడవాడల్లో పండుగ వాతావరణంలా జరుపుకోవడం అందరి అదృష్టమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబేడ్కర్ జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ విభాగం ఘనంగా నిర్వహించింది. వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరయ్యారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, పలు ప్రసంగాలు, ప్రచురణలు, జీవిత చరిత్ర, స్వాతంత్ర్యం ముందు, తర్వాత వంటి అంశాలకు సంబంధించి ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి పలువురు అతిథులు ప్రారంభించి తిలకించారు. అక్కడ ఏర్పాటు చేసిన గంటను అతిథులు మోగించి సమసమాజ స్థాపనకు చేస్తున్న కృషికి మద్దతు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకొని, నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రాంభించారు. మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దేశ ప్రగతిని చాటారని అభినందనలు తెలిపారు. మిగతా పండుగల తరహాలో అందరూ సంతోషాలతో అంబేడ్కర్ జయంతిని జరుపుకొంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ జననం, జీవన విధానం గురించి తెలుసుకొని, అందుకు అనుగుణంగా సమాజాభివృద్ధికి పాటు పడేందుకు కృషి చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం పలువురికి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.

48 గంటల్లోగా కన్నా క్షమాపణ చెప్పాలి

- లేదంటే భవిష్యత్ కార్యాచరణ తప్పదు
- దళిత, ప్రజా సంఘాల హెచ్చరిక
- అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న పరిశపోగు శ్రీనివాసరావు, జొన్నలగడ్డ శ్రీకాంత్, కార్పొరేటర్లు తదితరులు

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ఆయన జయంతి రోజున దళితుల ఆత్మగౌరవం దెబ్బతినిందని నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, మాల మహానాడు రాష్ట్ర నేత జొన్నలగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నేత కన్నా లక్ష్మీనారాయణ దురుసుగా దళిత నేతలను తోసుకుంటూ... తలుపు నెట్టుకుంటూ... సర్కిల్ లోపలికి వెళ్లి అహంకారపూరితంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడంపై శనివారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ధ్వజమెత్తారు. తన ప్రవర్తన ద్వారా యావత్ దళిత జాతిని అవమానించిన కన్నా లక్ష్మీనారాయణ ఇదే అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా 48 గంటల్లో క్షమాపణలు తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆధునికీకరించి సరిగ్గా అంబేడ్కర్ జయంతి రోజున దానిని ప్రారంభించాలనీ... ఆ కూడలికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలనీ... గుంటూరు నగరపాలకసంస్థ నిర్ణయించిన సంగతి అందరికీ తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఆధునికీకరణ పూర్తి చేసుకున్న అంబేడ్కర్ సర్కిల్‌ను ఒక పండుగ వాతావరణంలో ప్రారంభించాలని సంకల్పించి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో పెద్ద ఎత్తున ఒక అధికారిక కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. అయితే ఈలోపే తన మందీ మార్బలంతో అక్కడికి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న దళిత నాయకుడు బోడపాటి కిశోర్‌కుమార్ కార్యక్రమం వివరాలను కన్నా లక్ష్మీనారాయణకు వివరించి, కొద్దిసేపు ఆగవలసిందిగా అభ్యర్థించారు. అయినప్పటికీ ఆగని కన్నా అతనిని అక్కడే ఉన్న ఇతర దళిత నాయకులను తోసుకుంటూ, సర్కిల్ తలుపు నెట్టుకుంటూ లోపలికి వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఆగ్రహించిన దళిత, ప్రజాసంఘాల నేతలు శనివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన కన్నా లక్ష్మీనారాయణ దళిత జాతికి క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని లేకుంటే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పరిశపోగు శ్రీనివాసరావు, జొన్నలగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఒక విదేశీ పేరుతో కొనసాగిన కూడలిని దళితుల ఆత్మగౌరవ సూచికగా ప్రపంచ మేధావి అంబేడ్కర్ పేరిట నామకరణం చేసుకుంటున్న శుభతరుణంలో మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నేత కన్నా లక్ష్మీనారాయణ ఉద్దేశ్యపూర్వకంగా ఉద్రిక్తతలు సష్టించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. మంత్రి మేరుగ నాగార్జున వచ్చే వరకు తాను ఆగడం ఏమిటన్న దురహంకారంతో దళిత నేతలపై దౌర్జన్యం చేసిన కన్నా లక్ష్మీనారాయణ ఖచ్చితంగా దళిత జాతికి క్షమాపణ చెప్పాల్సిందేనని వారు పట్టుబట్టారు. లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోడపాటి ఉషా కిషోర్, అంబేడ్కర్, దూపాటి వంశీ, స్మిత పద్మజ, అందుగుల సంతోష్, మల్లవరపు రమ్య, అగ్గిపెట్టి రాజు, పూనూరు నాగేశ్వరరావు, మాల మహానాడు నాయకులు నీలాంబరం, స్టాలిన్ బాబు, బత్తుల అనిల్, కత్తి అనిల్, రాయపూడి మరియదాసు, దీనరాజు, రత్నరాజు, పాకాల ప్రకాష్, ఆలా కిరణ్, మాదాసు భాగ్యారావు, మాదాసు కిరణ్, కతారి మోహన్, కార్పొరేషన్ డైరెక్టర్లు గనిక జాన్సీ, పిల్లి మేరీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు డాక్టర్ పరిశపోగు భరత్, ముట్లూరి ఆకాశ్, సుంకర నాని తదితరులు పాల్గొన్నారు.

416 క్యూసెక్కులు విడుదల



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 416 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 58 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 102 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 121 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 420 క్యూసెక్కులు విడుదల చేశారు.

క్లుప్తంగా

గుంటూరులో సాయిధరమ్ తేజ్ సందడి



పాత గుంటూరు: ప్రముఖ సినీ హీరో సాయి ధరమ్ తేజ్ గుంటూరులో సందడి చేశారు. ఈనెల 21న విడుదల కానున్న విరూపాక్ష చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శనివారం రాత్రి సాయి ధరమ్ తేజ్ నగరానికి వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆయనను చూసేందుకు వచ్చిన అభిమానులను పలుకరించారు. అభిమానులు సెల్ఫీలతో సందడి చేశారు. చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని సాయి ధరమ్ తేజ్ అభిమానులను కోరారు.

17న అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో గల ఆర్‌ఎస్‌సీఏ స్టేడియంలో ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-2, సీనియర్ క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తామని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు తెలుపు జెర్సీలతోపాటు పుట్టిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. అండర్-23 క్రీడాకారులు 01-09-2000 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు ఏప్రిల్ 21వ తేదీ నుంచి కృష్ణాజిల్లా మూలపాడు క్రికెట్ గ్రౌండ్స్‌లో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో టీ-20, వన్‌డే మ్యాచ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం పీ.శ్రీనివాస్, 95734 24360, బీ.శ్రీనివాసరావు 98495 29919లో సంప్రదించాలని అసోసియేషన్ కార్యదర్శి కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

20 కిలోలు స్వాధీనం

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 20 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ విశాఖపట్నం గాజువాక నుంచి అనంతపురం పుట్టపర్తికి ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు విజయవాడ బస్టాండ్ నుంచి పుట్టపర్తి బయలు దేరిన బస్సును పెదకాకాని వై జంక్షన్‌లో తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీలో రెండు కిలోల బరువు కలిగిన 10 ప్యాకెట్లు గంజాయి లభ్యమైందని వివరించారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడు తెలంగాణ నల్గొండ జిల్లా, నకిరేకల్లు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవి గత కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసై అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే దురాశకు పోయినట్లు చెప్పారు. గాజువాకకు చెందిన కోటి అనే వ్యక్తితో 20 కిలోల గంజాయిని పుట్టపర్తి తీసుకు వెళితే 15 వేల రూపాయలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఈ కేసులో గంజాయి తరలిస్తున్న పాపాని రవితో పాటు గంజాయి సరఫరా చేస్తున్న కోటి అనే వ్యక్తిపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు పాదర్తి కోటేశ్వరరావు, గీతాంజలి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బండారు సురేష్‌బాబు, పక్కన ఎస్‌ఐలు గీతాంజలి, కోటేశ్వరరావు

విజ్ఞాన్‌లో ఏఎఫ్‌ఎస్‌టీఐ గుంటూరు చాప్టర్ ప్రారంభం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏఎఫ్‌ఎస్‌టీఐ(అసోసియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఇండియా) గుంటూరు చాప్టర్‌ను శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో గ్రీన్ కోటింగ్ 'ఇన్వెస్టింగ్ ఇన్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ సిస్టమ్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఏఎఫ్‌ఎస్‌టీఐ వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్‌లోని సీఎస్‌ఐఆర్- సీఎఫ్‌టీఆర్‌ఐ ఆర్‌సీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏఎఫ్‌ఎస్‌టీఐ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్, ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 46 చాప్టర్లు, 4500 మంది సభ్యులు ఉన్నారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నేడు రెండో ఏఎఫ్‌ఎస్‌టీఐ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. మానవాళికి నాణ్యమైన ఆహారాన్ని అందించటమే ఏఎఫ్‌ఎస్‌టీఐ ముఖ్య ఉద్దేశమన్నారు. ఏఎఫ్‌ఎస్‌టీఐ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీ రామకృష్ణ, మహారాష్ట్రలోని విట్టల్‌గంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో.లిమిటెడ్ ఫౌండర్ ధనరాజ్ షిండే పాల్గొన్నారు.



మాట్లాడుతూ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి తదితరులు

30లోగా దరఖాస్తు చేయండి

నరసరావుపేట: జిల్లాలోని 11 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఉన్న ఖాళీలకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి జి.వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి మూడవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలు ఉన్నాయన్నారు. నాగార్జునసాగర్, మినీ గురుకులం గుడిపాటి చెరువులో చెంచులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. 30వ తేదీలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన

పట్నంబజారు: 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని పలువురు ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుంటూరు పశ్చిమ, పొన్నూరు ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నూరిఫాతిమా మాట్లాడారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గృహసారథులు నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు 61 లక్షల మంది వద్దకు వెళ్లినట్లు చెప్పారు. 47 లక్షల మంది మిస్డ్ కాల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పిన విధంగా 98 శాతం హామీలు అమలు చేశామని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ప్రజలను నేరుగా మంచి చేస్తేనే ఓటు వేయమని అడుగుతున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడు లాగా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను విస్మరించే నైజం సీఎం జగన్‌ది కాదన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా స్పష్టంగా పీపుల్స్ సర్వే నిర్వహించి, వారి అభిప్రాయాలు సేకరించడం జరుగుతోందని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ప్రజా మద్దతుతోనే రానున్న ఎన్నికలకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఈనెల 7న ప్రారంభమైన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఒక ఉప్పెనలా ప్రారంభమైందన్నారు. 31 లక్షల మందికి స్థలాలు ఇచ్చి నివాసాలు కట్టిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. జేసీఎస్ రాష్ట్ర రీజనల్ కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి పక్ష పార్టీలకు సంబంధించిన మిత్రుల నుంచి కూడా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాను గాలి వీస్తోందని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రోశయ్య, గిరిధర్, ఎమ్మెల్సీ ఏసురత్నం, రవీంద్రారెడ్డి, నూరిఫాతిమా

అభివృద్ధి, సంక్షేమ పథకాలను సత్వరమే పూర్తి చేయండి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సత్వరం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో కలిసి జిల్లాకు చెందిన ముగ్గురు రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ ఆధారిత భూముల పంపిణీ కోసం గుర్తింపు, లంక భూముల పరిశీలన, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన శ్మశానవాటికల కోసం ప్రభుత్వ భూముల గుర్తింపు, పంపిణీ, ఓ.టి.ఎస్, ఓ.టి.సి, ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్, భూముల రీ సర్వే, ఎఫ్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారం, ఇ-ఆఫీస్ పర్యవేక్షణ, స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారం, ఏ.పి.మీసేవ సర్వీసుల ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం, మ్యుటేషన్ సమస్యల పరిష్కారం, క్రయ, విక్రయాలు, సాదా బైనామా, ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ, సివిల్ సప్లయ్ పంపిణీలో వచ్చే సమస్యల పరిష్కారం, ఎన్నికలకు సంబంధించి ఓటరు కార్డులకు ఆధార్ కార్డుల అనుసంధానం, నకిలీ ఓటరు కార్డుల తొలిగింపు, మార్పులు, చేర్పులు, ఓటరు కార్డుల బదిలీలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఇళ్ల స్థలాలు పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగర పరిధిలోని పేదలకు కేటాయించనున్న ఇళ్ల స్థలాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శనివారం పరిశీలించారు. నగర పరిధిలోని నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో కలసి స్థలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. తొలుత ఆయా ప్రాంతాల్లో నివసించే స్థానిక పేదలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అవసరమైన పేదలందరికీ స్థలాలు కేటాయించేలా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నవులూరులో 65 ఎకరాలు, యర్రబాలెంలో 130 ఎకరాలు, కృష్ణాయపాలెంలో 116 ఎకరాలు, నిడమర్రులో 175.75 ఎకరాలను పేదల నివేశన స్థలాల కోసం కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నవులూరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ తదితరులు

ఆటోను ఢీకొన్న లారీ

నలుగురికి గాయాలు

మేదరమెట్ల: ప్రయాణికులతో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఇంకొల్లు నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆటో పీ.గుడిపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న లీలాకృష్ణ హోటల్ వద్దకు రాగానే చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కాగా ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.